సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 9 । మార్చి । 2023



కిడ్నీ వ్యాధులతో జాగ్రత్త..!

మానవ శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) అతి ముఖ్యమైనవి. వీటి పనితీరు మసకబారితే ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. - 8లో



గవరమ్మపేటలో గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం సమీపంలో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. - 8లో



పోటీపడి ముందుకెళ్లడమే సాధికారత

మహిళా సాధికారత అంటే అన్ని రంగాలలో పోటీపడి ముందుకు వెళ్లడమేనని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.పద్మావతి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పార్వతీపురం ఐటీడీ ఏపీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ 15 లో గా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీడబ్ల్యూ గురుకులం.ఏపీ.జీఓవీ ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం గుమ్మలక్ష్మీపురం ప్రిన్సిపాల్ 63035 08032, గురుకులాల ఇన్‌చార్జి 94909 71090 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఖాళీలు ఇలా...

- కురుపాం ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతిలో 30 సీట్లు బాలురు, 30 బాలికలకు, 7వ తరగతిలో 3 సీట్లు బాలురకు, 8 బాలికలకు, 8వ తరగతిలో ఒకటి బాలురు, 9వ తరగతిలో 7 సీట్లు బాలురు, 3 బాలికల సీట్లు ఖాళీగా ఉన్నాయి.
- అనసభద్ర పాఠశాలలో 6వ తరగతిలో 30 బాలురు, 30 బాలికలు ఖాళీలున్నాయన్నారు. 7వ తరగతిలో 3 బాలురు, 4 బాలికలు, 9వ తరగతిలో 3 బాలురు, 3 బాలికలు ఖాళీలున్నాయి.
- కొటికపెంట పాఠశాలలో 6వ తరగతిలో 30 బాలురు, 30 బాలికల ఖాళీలున్నాయన్నారు. 7లో 14 బాలురు, ఒకటి బాలికలు, 8లో 7 బాలురు, 9వ తరగతిలో 8 బాలురు, 6 బాలికల సీట్లు భర్తీచేస్తారు.
- గుమ్మలక్ష్మీపురం పాఠశాలలో 6వ తరగతిలో 30 బాలురు, 30 బాలికల సీట్లు, 8వ తరగతిలో ఒకటి బాలురు, 9వ తరగతిలో ఒకటి బాలురు సీట్లు ఖాళీలున్నాయి.

గంగమ్మతల్లి జాతరలో రాజన్నదొర



కోట సందర్శన అనంతరం జమీందారులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర, తదితరులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గంగమ్మతల్లి జాతరలో డిప్యూటీ సీఎం రాజన్నదొర బుధవారం పాల్గొన్నారు. ఆండ్ర జమీందార్ బాబావారి ఆహ్వానం మేరకు కోటలోకి వెళ్లి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. జమీందారులతో ఫొటోలు దిగారు. రాజన్నదొర వెంట సర్పంచ్ వాకపల్లి లక్ష్మి, పార్టీ నాయకులు కుంచు తిరుపతి,శంకరరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్‌నాయుడు, గృహసారథుల మండల కన్వీనర్ కనిమెరక త్రినాథరావు, కిలపర్తి మధు, పిట్టాడ సర్పంచ్ నాయుడుబాబు ఉన్నారు.

కలశపూజ



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలశపూజ చేస్తున్న భక్తులు

సీతానగరం: హోలీపండగను పురస్కరించుకుని లచ్చయ్యపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారికి ద్వారాకా తిరుమల ఆలయ అర్చకుడు సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా క్షేమంగా ఉండాలంటూ కలశపూజను జరిపారు.

వైభవంగా పోలమాంబ అనుపోత్సవం



బాడంగి పోలమాంబ ఘటాలను గుడికి తీసుకెళ్తున్న భక్తులు

బాడంగి: పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం వైభవంగా సాగింది. అమ్మవారి ఘటాలను మంగళవారం రాత్రంతా బాడంగి గ్రామంలో తిరువీధి జరిపారు. అమ్మవారి చావిడివద్ద కొద్దిసేపు దింపారు. అనంతరం ఉజ్జిడిబల్లపై అంజలిరథాన్ని అధిరోహించి పూజార్లు రచ్చబండ రోడ్డు నుంచి అమ్మవారి గద్దెవరకు ముడుసార్లు ప్రదక్షణలు చేశారు. ఉదయం చుక్కలసురకొయ్యపై బండి చక్రం ఉంచిన అనంతరం చావిడి వద్ద దించిన ఘటాలను మహిళాభక్తులు గ్రామ పొలిమేరలోని పోలమాంబ గుడికి తీసుకెళ్లారు. అమ్మవారి ఘటాలకు దారిపొడవునా భక్తులు పసుపుకుంకుమలతో పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

● రంగుల సంబరం



భామిని: లివిరిలో రాధాకృష్ణుల హోలీ సంబరాల ఊరేగింపు



పాలకొండలో హోలీ కేరింత



మక్కువ: డ్యాన్సులు చేస్తూ, సెల్ఫీలు తీసుకుంటున్న సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు



భామిని: వంశధార నదిలో గోపీనాథుని చక్రతీర్థస్నానాల్లో భక్తుల కోలాహలం

ఫల్గుణమాస పౌర్ణమి వేళ.. వసంతగమనంలో వచ్చే హోలీ పండగను పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు బుధవారం సందడిగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులతో తడిసిముద్దయ్యారు. హరివిల్లులోని రంగులన్నీ కలగలిపి ఒకరిపైఒకరు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

- భామిని మండలం లివిరిలో వెలసిన గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో హోలీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెలుగు–ఒడియా భక్తులు వేలాదిగా పాల్గొని ఉత్సవ విగ్రహాల తిరువీధిలో రంగులు జల్లుకుంటూ ముందుకు సాగారు. వంశధార నదిలో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రంగుల పండగతో వంశధార నదీ తీరం పులకించిపోయింది.
- మక్కువలోని సీఆర్‌పీఎఫ్ బ్యారెక్‌లో హోలీపండగను జవాన్‌లు ఉత్సాహంగా జరిపారు. చిన్నారులుకు అసిస్టెంట్ కమాండెంట్ ఆసుకుమారి రంగులు అద్ది, స్వీట్లు పంచిపెట్టారు.

– భామిని/మక్కువ/పాలకొండ రూరల్

కొండచీపుర్లకు గిరాకీ



సీతంపేట వారపు సంతకు గిరిజనులు తెచ్చిన కొండచీపుర్లు (ఫైల్)

- సంతల్లో భారీగా అమ్మకాలు
- కొనుగోలుకు పోటీపడుతున్న జీసీసీ అధికారులు, మైదాన ప్రాంత వ్యాపారులు
- జీసీసీ 60 వేల చీపుర్ల కొనుగోలు
- నాణ్యతను బట్టి ఒక్కో చీపురు రూ.40 నుంచి రూ.45

సీతంపేట:

మన్యంలో కొండచీపుర్ల సీజన్ ఆరంభమైంది. గిరిజనులు పెద్ద ఎత్తున సంతలకు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడి కొండచీపుర్లు నాణ్యమైనవి కావడంతో కొనుగోలుకు అటు గిరిజన సహకార సంస్థ (జీసీసీ),ఇటు మైదాన ప్రాంత వ్యాపారులు పోటీపడుతున్నారు. జీసీసీ గిరిజనుల వద్ద నుంచి దాదాపు 60 వేల కొండచీపుర్లను గ్రేడ్‌ను బట్టి రూ.40, రూ.45కు కొనుగోలు చేసి బయటమార్కెట్‌లో విక్రయిస్తోంది. సీతంపేట (సోమవారం), దోనుబాయి (గురువారం), మర్రిపాడు(బుధవారం), పొల్ల, కుశిమి(శనివారం)లలో జరిగే వారపు సంతల్లో ప్రస్తుతం కొండచీపుర్ల విక్రయాలు జోరందుకున్నాయి.

తయారీకి శ్రమించాల్సిందే...

ఏజెన్సీలో కొండ ప్రాంతంలో కొండచీపురును గిరిజనులు సేకరిస్తారు. వాస్తవంగా ఇది సాహసంతో కూడిన పని. గిరిశిఖరాలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో పెరిగే కొండచీపురు పుల్లలు సేకరించేందుకు గిరిజనులు ఇంటిల్లిపాదీ శ్రమిస్తారు. వారం రోజుల పాటు ఎండబెట్టిన అనంతరం చీపుర్లను కట్టలుగా కట్టి ఒక్కో చీపురును రూ.45 నుంచి రూ.60 వరకు నాణ్యతనుబట్టి విక్రయిస్తామని గిరిజనులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఉత్పత్తి ఎక్కువగా ఉందని గిరిజనులు తెలిపారు. సంతల్లో కొనుగోలు చేసిన చీపుర్లు ఎక్కువగా విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రికి తరలిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు.



వ్యాన్‌లో చీపుర్లు ఎక్కిస్తున్న వ్యాపారులు(ఫైల్

గిరిజనులకు గిట్టుబాటు ధరలు



గిరిజనులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొండ చీపుర్లను వారపు సంతల్లో కొనుగోలు చేస్తున్నాం. గతేడాది కంటే ఈ సంవత్సరం మద్దతు ధర పెంచాం. నాణ్యతను బట్టి ధర చెల్లిస్తున్నాం.

– దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్

సేకరణ కష్టం



కొండకోనల్లో ఉన్న కొండ చీపురుపుల్లలు వెతకడం కష్టం. ఇవి దొరికిన తర్వాత వీటిని కోసి ఇళ్లకు తీసుకువస్తాం. ఇంటిల్లపాది కష్టపడితే రోజుకు 5 చీపుర్లకు సరిపడా సరుకును సేకరించగలం. వీటిని చీపుర్లుగా అల్లిక కూడా కష్టంతో కూడుకున్నదే.

– ఎస్.బంగారయ్య, పెద్దగూడ

గిరిజనులకు ఉపాధి



కొండచీపుర్ల అమ్మకాలు గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి. కష్టమైనా ఖాళీ సమయాల్లో కొండలపైకి వెళ్లి చీపుర్లను సేకరిస్తారు. వాస్తవంగా మార్కెట్‌లో పలుకుతున్న ధర గిరిజనుల శ్రమకు సరిపోదు. మరికాస్త ధర పెంచాలి.

– ఎస్.సుజాత, అంటికొండ గూడ

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

- 1– 9వ తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఏ– 4 పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు



పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

వీరఘట్టం: పదో తరగతి విద్యార్థులకు గురువారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నవి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు సిలబస్ బోధన పూర్తికావడంతో పాటు రెండుసార్లు రివిజన్ చేయడం, రోజువారీ, వారాంతపు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలపై భయం పోయేందుకు, రాత నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు, అభ్యసనా సామర్థ్యాలు అంచనావేసుకునేందుకుప్రీఫైనల్ పరీక్షలు విద్యార్థులకు దోహద పడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే, 1–9వ తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఏ–4 పరీక్షలు కూడా గురువారం నుంచి జరగనున్నాయి.


శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా..

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది 11,051 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో 10,798 మంది ప్రభుత్వ, 253 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం సబ్జెక్ట్ వారీగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉత్తీర్ణతలో వెనుకబడకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణతో నిత్యం సాధన చేయిస్తున్నారు.

ప్రీ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	సబ్జెక్టు
9	ఫస్ట్ లాంగ్వేజీ
10	సెకెండ్ లాంగ్వేజీ
14	ఇంగ్లిష్
15	గణితం
16	సైన్స్
17	సోషల్ స్టడీస్
18	సోషల్–1

మనోధైర్యం వస్తుంది



ప్రీ ఫైనల్ పరీక్షలు రాయడం వల్ల పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల్లో మనోధైర్యం పెరుగుతుంది. అన్ని విద్యాశాఖ కార్యాలయాల్లో టెన్త్ ప్రీ ఫైనల్ పశ్నపత్రాలు సిద్ధంగా ఉన్నాయి. ఏ రోజు పరీక్షకు సంబంధించి ఆ పాఠశాలల సిబ్బంది వచ్చి ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలి. ఈ నెల 9 నుంచి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు సాగుతాయి.

– ఎస్‌డీవీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం

కనుల పండువగా డోలాయాత్ర

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో సీతారాముల డోలాయాత్ర బుధవారం కనులపండువగా సాగింది. ఉదయం భక్తుల భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై తిరువీధి జరిపారు. అనంతరం భక్తులకు ఉత్తరముఖ దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు బి.ప్రసాదరావుశర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గుళ్లసీతారాంపురం, తాలాడ, ఎస్.రంగారాయపురం, బొద్దూరు, సోమరాజుపేట, వావిలవలస, అంబకండి, తాటిపాడు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గెలిపించాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న నాయకులు

- నాయకులకు దిశానిర్దేశం చేసిన విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ
- జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పార్వతీపురంటౌన్:

శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ స్పష్టం చేశారు. పార్వతీపురం పట్టణంలో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులు, 15 పోలింగ్ కేంద్రాల పీఓసీలు, పట్టభద్రుల ఓటర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్‌సీపీ గతంలో ఎన్నడూ నేరుగా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పాల్గొనలేదని, తొలిసారిగా పార్టీ తరఫున అభ్యర్థిని బరిలోదించిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన సీతంరాజు సుధాకర్‌ను పూర్తి మెజార్టీతో గెలిపించి తీరాలని, అందుకు ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. పోలింగ్ సమయం దగ్గర పడుతోందని, ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించాలన్నారు. మరో ఏడాదిలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని, దానికి ముందుగా మన ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంసాధించి రానున్న ఎన్నికలకు సూచికగా నిలవనుందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి వైద్యం, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీఒక్కరు కృషిచేయాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామన్నారు. టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టి పార్టీ అభ్యర్థి విజయానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి, కాపుకార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రంగుముద్రిరమాదేవి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, యూత్‌వింగ్ జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, పీఓసీలు పాల్గొన్నారు.

ప్రపంచం చూపు ఆంధ్రా వైపు..

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో ఆంధ్రా సత్తా ప్రపంచానికి తెలిసింది
- రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం



గ్లోబల్ ఇన్విస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాచిపెంట:

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరు కాదని, ఓ సమ్మోహన శక్తికి బ్రాండని, నేడు ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరూ ఆంధ్రావైపు చూసేందుకు ఆయన పాలన తీరే నిదర్శనమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన నేపథ్యంలో మండలంలోని పాంచాలి గ్రామంలో బుధవారం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్ పేర్కొన్నట్టుగా జగన్‌పేరు కాదని ఓ బ్రాండ్ అని విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంతో ప్రపంచానికి తెలిసిందన్నారు. అపరకుబేరులైన అంబానీ, బిర్లా వంటి 30 మంది దిగ్గజ పారిశ్రామిక వేత్తలు నేరుగా ఈ సమావేశానికి హాజరుకావడం, 45 దేశాల పారిశ్రామిక వేత్తలు ఏపీలో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించడం సంతోషంకలిగించే అంశమన్నారు. సమ్మిట్ విషయంలో జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ చేసిన సూచనలను స్వాగతిస్తున్నామన్నారు. అనుభవజ్ఞుడునని చెప్పుకునే చంద్రబాబు, ఆయన నాయకులు చేసిన దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికు దేశంలో శక్తివంతుడైన ముఖ్యమంత్రిగా, మంచి పరిపాలనాదక్షుడిగా పేరురావడంతో ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు, ఎల్లోమీడియా విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా పాలనసాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటువేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్‌ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, నాయకులు టి.గౌరీశ్వరరావు, కలువలపల్లి పెద్దిబాబు, సనపతినారాయణరావు, లాది అప్పలనాయుడు, గండిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. పాంచాలి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జె.సూర్యనారాయణను రాజన్నదొర పరామర్శించారు. ఆరోగ్య బాగోగులు తెలుసుకున్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు

రేగిడి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు బూరాడ కూడలి వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు, విజయనగరం జిల్లాలకు మధ్య ఈ కూడలి ఉండడంతో ఇక్కడ బుధవారం నుంచి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

క్లుప్తంగా

కిండాం అగ్రహారంలో పులి పాదముద్రలు..!



పులి పాదముద్రలును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బొండపల్లి: మండలంలోని కిండాం అగ్రహారంలో గల మామిడితోటలో పులి పాదముద్రలను స్థానికులు బుధవారం గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేయడంతో ట్రాకర్ అమర్‌తో పాటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.రామారావు, కేవీ వెంకటరమణ ఆ ప్రాంత్రాన్ని పరిశీలించారు. అవి పులి పాదముద్రలుగా గుర్తించి, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు



గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై లచ్చయ్యపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పెంట శ్రీనివాసరావు తన ఆటోకు గీజరు తగిలించి బొబ్బిలి వెళ్తున్నాడు. అదే సమయంలో సాలూరు నుంచి పార్వతీపురం వెళ్తున్న కారు లచ్చయ్యపేట వద్ద ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. శ్రీనివాసరావు తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

చివుకుల శ్రీలక్ష్మికి ఉగాది పురస్కారం



చివుకుల శ్రీలక్ష్మి

విజయనగరం టౌన్: ప్రముఖ రచయిత్రి, జిల్లా రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు చివుకుల శ్రీలక్ష్మికి ఉగాది పురస్కారం అందజేయనున్నట్లు వాగ్దేవీ సమారాధనం సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పి.స్వప్నహైందవి తెలిపారు. గురజాడ స్వగృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వాగ్దేవీ సమారాధనం సంస్థ చతుర్థి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రచయిత్రి శ్రీలక్ష్మికి వాగ్దేవీ సాహితీ సుధ బిరుదుతో ఉగాది రోజున సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు అనంత రవికుమార్ ఆచార్యులు, ధవళ సర్వేశ్వరరావు, దేవరాజు గోపాలకృష్ణ, సంధ్య, షేక్ గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులు భావ వ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయి నుంచే కలిగి ఉండాలని గురజాడ పాఠశాల డైరెక్టర్ ఎం. కృష్ణాజీ అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ స్వరూప, హెచ్‌ఎం పి. శేఖర్ పాల్గొన్నారు.

మహిళలు మరింత అభివృద్ధి సాధించాలి

విజయనగరం పూల్‌బాగ్: మహిళలు మరింత అభివృద్ధి సాధించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బొత్స పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సత్యవతి, పద్మావతి, కాంచన ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుకారీబాబు, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ కె. రవి, శ్రీనివాసన్, రాంబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో (బాలికలు) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఏప్రిల్ 23న ఉదయం ఐదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు.

కిడ్నీ వ్యాధులతో జాగ్రత్త..!

- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం
- బీపీ, నుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి
- జిల్లాలో 5 వేల మంది వరకు కిడ్నీవ్యాధి బాధితులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డయాలసిస్ యూనిట్‌లో డయాలసిస్ చేయించుకున్న కిడ్నీ వ్యాధి గ్రస్తురాలు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) అతి ముఖ్యమైనవి. వీటి పనితీరు మసకబారితే ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. చికిత్స చేసుకోవడంలో అశ్రద్ధవహిస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధులకు దూరంగా జీవించాలని, చక్కని ఆహారపు అలవాట్లు, ఒత్తిడి లేని జీవితం అలవర్చుకోవాలని హితబోధ చేస్తున్నారు.

జిల్లాలో 5 వేల మందికి పైగా వ్యాధిగ్రస్తులు

జిల్లాలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో సుమారు ఐదువేల మంది బాధపడుతున్నట్టు వైద్య రికార్డులు చెబుతున్నాయి. కిడ్నీ వ్యాధులను ప్రారంభదశలో గుర్తించకపోవడం వల్ల డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితికి చేరుతున్నారు. కిడ్నీ వ్యాధులు తలెత్తిన వెంటనే చికిత్స చేయించుకుంటే సురక్షితంగా జీవించవచ్చు. ఇటీవల కాలంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతున్నట్టు పలు అధ్యయనాల్లో తేలింది. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం, అంటువ్యాధులు, మాదక ద్రవ్యాల వినియోగమే మూత్రపిండాల వ్యాధికి ప్రధానకారణమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి సోకితే..

కిడ్నీ వ్యాధి సోకితే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ. ఎముకలు బలహీనపడతాయి. మూత్ర విసర్జన కష్టమవుతుంది. అధిక మూత్ర విసర్జన సమస్యలు, దాహం పెరగడం, అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, నురుగు మూత్రం వంటివి కిడ్నీవ్యాధి లక్షణాలు.

జాగ్రత్తలు ఇలా..

ఆరోగ్యకరమైన జీవన శైలితో వ్యాధిబారిన పడకుండా జాగ్రత్తపడొచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా జాగ్రత్తపడుతూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. దూమపానానికి దూరంగా ఉండాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, వార్షిక శారీరక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకోవాలి. మూత్రపిండ వ్యాధిని గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం, యోగా వంటివి చేయాలి. తగినంత నిద్రపోవాలి. పొగాకు, ఆల్కహాల్ తీసుకోరాదు.

ఆహారపు అలవాట్లే ప్రధానం



ఒత్తిడిలేని జీవన విధానం అలవర్చుకోవడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కిడ్నీ వ్యాధికి దూరంగా జీవించవచ్చు. కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు. బీపీ, సుగర్ వంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి. శారీరక శ్రమకోసం ప్రతిరోజు వ్యాయామం చేయాలి. శరీరంలో కొవ్వు పెరగకుండా చూసుకోవాలి. – డాక్టర్ ఆర్.రవికుమార్, నెఫ్రాలజిస్టు, విజయనగరం

పోటీపడి ముందుకెళ్లడమే సాధికారత

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి

విజయనగరం అర్బన్: మహిళా సాధికారత అంటే అన్ని రంగాలలో పోటీపడి ముందుకు వెళ్లడమేనని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) స్థానిక యూత్ హాస్టల్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాభారతం, రామాయణాలలో తెలిపిన మహిళల ఔన్నత్యం, సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పాటలు, అంత్యాక్షరి, క్విజ్, మ్యూజికల్ చైర్, లక్కీ ఉమెన్, డిబెట్ పోటీలలో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జి.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యుగంధర్, జిల్లా కార్యదర్శి కంటి వెంకటరమణ, కోశాధికారి వై.శంకరరావు, సంయుక్త కార్యదర్శి లెంక సత్తిబాబు, సంఘం మహిళా విభాగం కార్యదర్శి రంభ జ్యోతి, సభ్యులు పద్మజ, కనకరత్నం, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రిని కలిసిన అవనాపు విక్రమ్



స్పీకర్‌ను కలిసిన అవనాపు



మంత్రి బొత్సను కలిసిన అవనాపు విక్రమ్, డీవీజీ శంకరరావు

విజయనగరం/ఆమదాలవలస: శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరిసీతారామరాజు జిల్లాలకు వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన అవనాపు విక్రమ్ ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోను, మంత్రి బొత్స సత్యనారాయణను విజయనగరంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే, మంత్రి బొత్సను మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి డీవీజీ శంకరరావు కలిశారు. పార్టీని బలోపేతం చేయడం, రానున్న ఎన్నికలకు యువత ప్రధాన పాత్ర పోషించే విధంగా కార్యాచరణతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ ఇరువురు నాయకులకు సూచించారు.

పెట్టుబడులు రావడం గొప్ప విషయం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడం గొప్ప విషయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సమ్మిట్ విజయవంతం కావడంతో బుధవారం స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెట్టుబడులకు ఆంధ్రా బెస్ట్ చాయిస్ అనేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నమ్మకం కల్పించారన్నారు. ఒకే రోజు 352 ఎంఓయూలు చేసుకోవడం దేశంలోనే ఒక రికార్డ్ అని చెప్పారు. వివిధ కంపెనీలు ఏర్పాటు వల్ల ఆరు లక్షల మందికి ప్రత్యక్షంగా.. పది లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కలగనుందని తెలిపారు. విశాఖకు అంతటి భాగ్యాన్ని కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర ప్రజలు రుణపడి ఉండాలన్నారు. ముఖ్యమంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయబోయే పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుని, ఉత్తరాంధ్ర ఉనికి చాటాలని పిలుపునిచ్చారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ, విశాఖ అభివృద్ధికి కంకణం కట్టుకున్న జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతరిగి మండలం, గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ గ్రామానికి చెందిన బిసాయి దేముడుబాబు అనేవ్యక్తి గతంలో వైఎస్సార్‌నగర్‌లోని చలుమూరి సాయి, మురళీకృష్ణ అనే వ్యక్తులకు గంజాయి సరఫరా చేసిన కేసులో పరారీలో ఉన్నాడు. వైఎస్సార్ నగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పక్కా సమాచారంతో టూటౌన్ సీఐ తన సిబ్బందితో కలిసి బిసాయి దేముడుబాబును అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. గంజాయిని ఒడిశా సరిహద్దు గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలుచేసి విజయనగరం పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిపాడు. గతేడాది నవంబర్‌లో మోహన్‌సాయి, మురళీకృష్ణల నుంచి రూ.9వేలు తీసుకుని కిలోన్నర గంజాయిని గంట్యాడ వద్దకు వచ్చి అప్పగించినట్టు నేరాన్ని అంగీకరించాడన్నారు. ఈ మేరకు అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

క్షీరాభిషేకం



రామభద్రపురం చొక్కాపు వీధిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

రామభద్రపురం: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో పాటు మహిళలు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం రామభద్రపురం మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలందరూ జగనన్న వెంటే ఉంటామని స్పష్టంచేశారు. ఆయన పాలనలోనే మహిళలకు భద్రత కలిగిందని, సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే అమలుచేస్తున్నారన్నారు.

పది కేసుల్లో నిందితుడి అరెస్టు



సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

- ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, బైక్‌ల రికవరీ
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: చోరీ కేసుతో పాటు పది కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం పెదవాల్తేరుకు చెందిన నిందితుడు కర్రి శివరామకృష్ణ ఓఎల్‌ఎక్స్‌లో వచ్చిన ప్రకటనలుచూసి వాటిని కొనుగోలు చేసేందుకు వెళ్తాడు. మాయమాటలతో బురిడీ కొట్టిస్తాడు. కొన్నిసార్లు బలవంతంగా వస్తువులను లాక్కుపోతాడు. ఈ తరహాలో హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 18 నేరాలకు పాల్పడ్డాడు. గుర్ల మండలం గరికివలసకు చెందిన కోరాట సత్యం అనే వ్యక్తి ల్యాప్‌టాప్‌ను అమ్మేందుకు ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన ఇచ్చాడు. వాటిని కొనుగోలు చేసేందుకు ఈ నెల 4న నిందితుడు బైక్‌పై విజయనగరం ఆర్‌అండ్‌బీ ప్రాంతానికి చేరుకుని, సత్యంను కలవాలని కోరాడు. ఆయన తన ల్యాప్‌టాప్‌తో అక్కడకు వెళ్లి అతనికి చెక్‌చేసుకోమని చెప్పాడు. అది పరిశీలిస్తున్నట్టు నటించి ల్యాప్‌టాప్‌ను పట్టుకెళ్లిపోయేందుకు శివరామకృష్ణ ప్రయత్నించాడు. సత్యం అడ్డుకోవడంతో కత్తితో బెదిరించి, ఛాతిపై గుద్ది ల్యాప్‌టాప్‌తో పరారయ్యాడు. బాధితుడు సత్యం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు, ఎస్ఐ వి.అశోక్‌కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు పి.శివశంకర్, టి.శ్రీనివాసరావు, ఎస్.అజయ్‌కుమార్‌లు దర్యాప్తుచేసి నిందితుడిని వన్‌టౌన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు మోటారుసైకిళ్లు రికవరీ చేశామని సీఐ తెలిపారు. నిందితుడు ఇదే తరహాలో విశాఖసిటీలో నాలుగు, పార్వతీపురం పట్టణంలో ఒకటి, విజయనగరం వన్‌టౌన్ పరిధిలో ఐదు నేరాలకు పాల్పడినట్టు గుర్తించారు.

ప్రజ్ఞావికాస పరీక్ష విజేతలు వీరే



పాగిరి శ్యామల (ప్రథమ)



బి.జయేంద్రనాయుడు (ద్వితీయ)

విజయనగరం పూల్‌బాగ్: పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు ఎస్ఏఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్తంగా ఇటీవల జిల్లా స్థాయిలో ప్రజ్ఞావికాస పరీక్ష నిర్వహించింది. దీనికి జిల్లా వ్యాప్తంగా 12వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష విజేతల వివరాలను ఎస్ఏఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పూడి రామ్మోహన్, ఈశ్వరరావు బుధవారం వెల్లడించారు. 96 మార్కులతో పాగిరి శ్యామల (సన్‌స్కూల్, రాజాం), 95 మార్కులతో బి.జయేంద్రనాయుడు (సెయింట్ జోసెఫ్ హైస్కూల్, విజయనగరం), 94 మార్కులతో కొమ్మోజు లావణ్య (ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గంట్యాడ), ఎస్.దిలీప్ కుమార్ (ఏపీ మోడల్ స్కూల్, సతివాడ) మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిల్చారన్నారు. వీరికి ఈనెల 19వ తేదీన విజయనగరం జిల్లాలో ప్రతిభా పురస్కారం అందజేస్తామని చెప్పారు.

వేగవంతంగా కేసుల దర్యాప్తు

- విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ



బత్తిలి మోడల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

భామిని: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని విశాఖరేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పోలీస్ అధికారులకు సూచించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని బత్తిలి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ ఎస్.దిలీప్‌కిరణ్‌కుమార్‌తో కలిసి బత్తిలిలో నిర్మిస్తున్న మోడల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్‌లో క్రైమ్ రికార్డులు తనిఖీచేసి కేసుల పరిస్థితిపై సమీక్షించారు. సకాలంలో చార్జిషీట్‌లు దాఖలు చేయాలని బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావును ఆదేశించారు. దిశ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామీణ మహిళలకు వివరించాలని సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. డీఐజీ పర్యటనతో సాయుధ బలగాలు మోహరించాయి. తివ్వా కొండల్లో కూంబింగ్ చేపట్టాయి.

అనుమానాస్పదంగా మహిళ మృతి



మృతి చెందిన హేమలత

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో యలమంచిలి హేమలత(28) అనే గృహిణి మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందినట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం హేమలతకు 2018లో నారాయణపురం గ్రామానికి చెందిన యలమంచిలి చిన్న నరసయ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత హేమలత ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. దీనిపై ఆమె సోదరుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గవరమ్మపేటలో గజరాజుల గుంపు



గవరమ్మపేట వద్ద జొన్నచేనులో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం సమీపంలో ఏనుగుల గుంపు బుధవారం సంచిరించింది. అరటి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగులు తమ పంటలను నాశనం చేస్తున్నా.. అటవీ అధికారులు చోద్యం చూడటం తప్ప వాటిని తరలించేందుకు ప్రయత్నించడం లేదని, తమకు ఏవిధమైన నష్టపరిహారం కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. గతకొంత కాలంగా బాసంగి, వెంకటరాజపురం, గదబవలస, నిమ్మలపాడు, బిత్రపాడు, బట్లభద్ర తదితర గ్రామాల సమీపంలో ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

బైక్ అదుపుతప్పి యువకునికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సతీష్

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామానికి చెందిన యువకుడు పెంట సతీష్ బైక్‌పై బుధవారం బొండపల్లి వైపు వస్తూ దేవుపల్లి కనిమెరక సమీపంలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో గజపతినగరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని సర్వజన ప్రభుత్వాస్పత్రికి 108లో తీసుకెళ్లారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210